క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన అదనపు కమిషనర్ రామలింగేశ్వర్



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న రామలింగేశ్వర్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఆర్ఎంసీ అదనపు కమిషనర్‌గా బదిలీపై వచ్చిన పీవీ రామలింగేశ్వర్ శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి ఆయనకు అభినందనలు తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఇక్కడ నిర్వహించే బాధ్యతలు ఎంతో కీలకమన్నారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో తనదైన పాత్ర పోషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర్ మాట్లాడుతూ, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా పనిచేస్తూ, బదిలీపై ఇక్కడికి వచ్చానన్నారు. అనంతపురం లోని రాయదుర్గానికి చెందిన ఆయన 2011లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో విధుల్లో చేరారు.

సత్వర వైద్య సేవలు అందించాలి

జీజీహెచ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రశాంతి



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రోగులకు జిల్లా ప్రభుత్వాస్పత్రి వైద్యులు అందుబాటులో ఉండి, సత్వర వైద్య సేవలు అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక జీజీహెచ్‌ను ఆకస్మిక తనిఖీ చేసి, పలు విభాగాలను పరిశీలించారు. రోగులు పొందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జనరల్ మెడిసిన్ విభాగం ప్రధాన వైద్యులు అందుబాటులో లేకపోవడంపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేని సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. విధుల్లో ఉన్న వైద్యులతో కలెక్టర్ మాట్లాడారు. వైద్య సేవలకు వచ్చిన రోగులు, వారి సహాయకులకు లభిస్తున్న సేవలపై ఆరా తీశారు.

20 నుంచి ఉద్భవ్-2025

కంబాలచెరువు: రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు ఉద్భవ్-2025 పేరిట జాతీయ స్థాయి యువజన దినోత్సవం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే తెలిపారు. విద్యార్థులలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో వివిధ స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

కొత్త విధానంలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు

కంబాలచెరువు: స్కూల్ కాంప్లెక్స్‌లను క్లస్టర్ కాంప్లెక్స్‌లుగా ప్రభుత్వం పునర్ వ్యవస్థీకరించినట్టు అర్బన్ రేంజ్ స్కూల్స్ డీఐ బి.దిలీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో సీఆర్ఎంటీలతో సమీక్ష నిర్వహించి, మార్గదర్శకాలు అందజేశారు. ఇకపై క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రతి నెలా మూడో శనివారం మాత్రమే నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయులు విధిగా హాజరు కావాలని చెప్పారు. రాజమహేంద్రవరం అర్బన్‌లోని 82 పాఠశాలలను 8 క్లస్టర్లుగా విభజించామన్నారు. క్లస్టర్ తొలి సమావేశం శనివారం నిర్వహిస్తామని తెలిపారు.

దోమల నివారణ చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట రామకృష్ణనగర్ దోమలకు నిలయంగా మారిందని స్థానికులు పంచాయతీ కార్యదర్శి జి.కాశీ విశ్వనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి శుక్రవారం దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్య మినీ	: కెప్టెన్ అమెరికా
సూర్య ప్యాలెస్	: పట్టుదల
స్వామి	: బ్రహ్మా ఆనందం
శివజ్యోతి	: తండేల్
అనుశ్రీ	: లైలా
రాజా	: తండేల్
ఊర్వశి	: కాంప్లికేటెడ్
మేనక	: నిదిరించు జహాపన, తల
రంభ	: ఆరెంజ్
కుమారి	: కెప్టెన్ అమెరికా
అప్సర	: తండేల్
అశోక	: లైలా
నామవరం	
వీఎస్ మహల్	: తండేల్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: తండేల్
కడియం	
వెంకటసూర్య	: లైలా

తలకెక్కించుకుంటేనే భద్రం

- హెల్మెట్ ధరించక రోడ్డు ప్రమాదాల్లో సంభవిస్తున్న మరణాలు
- పోలీసు, రవాణా అధికారుల హెచ్చరికలూ బేఖాతరు
- యువతే కాదు.. పెద్దలదీ అదే తీరు
- వాడకం తప్పనిసరి అయినా.. పట్టించుకోని వైనం



రాజమహేంద్రవరంలో హెల్మెట్ ధారణపై కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు



కంబాలచెరువు: హెల్మెట్ ధరించడం భారంగా భావిస్తూ, రోడ్లపై పోలీసులు తనిఖీలు చేస్తుంటే తప్పించుకుపోవడం అక్కడక్కడా కనిపిస్తుంటుంది. హెల్మెట్ అనేది మన రక్షణకే అనే సంగతిని ద్విచక్ర వాహనదారులు మర్చిపోతున్నారు. ఒక రకంగా చెప్పాలంటే అది మనిషి ప్రాణాలకు రక్షణ కవచం లాంటిది. నిర్లక్ష్యం చేయకుండా హెల్మెట్ ధరించాలంటూ పోలీసులు హెచ్చరిస్తున్నా వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. ఆ నిర్లక్ష్యానికి విలువైన ప్రాణాలను మూల్యంగా చెల్లించాల్సిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. నిర్లక్ష్యంతో ఆనందంగా సాగాల్సిన జీవన ప్రయాణంలో అంతులేని విషాదం నింపుకొంటున్న వారెందరో. ఫలితంగా రహదారులు రక్తసిక్తంగా మారుతున్నాయి. తమ వారిని కోల్పోయిన కుటుంబాలు జీవితాంతం దుఃఖ సాగరంలో మునిగిపోతున్నాయి.

కీలక నిర్ణయాలు

ఇటీవల జాతీయ రహదారి భద్రతా సమావేశంలో హెల్మెట్ వాడకం తప్పనిసరి చేస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించాలంటే హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయాలని తీర్మానించారు. ద్విచక్ర వాహన ప్రమాదాల్లోనే మరణాల శాతం ఎక్కువగా ఉంటోంది. ప్రమాద ఘటనల్లో తల రోడ్డుకు తగిలి, బలమైన గాయాలైన సందర్భాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని భద్రత నిపుణులు చెబుతున్నారు. అందుకే ద్విచక్ర వాహనచోదకులు ప్రతి ఒక్కరూ శిరస్త్రాణం ధరించాలని సూచిస్తున్నారు. ఇటీవల జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదాల్లో హెల్మెట్ లేక, తలకు గాయాలై క్షతగాత్రులు ఆస్పత్రుల్లో చేరిన కొన్ని సంఘటనల్లో మరణాలు చోటుచేసుకున్నాయి.

మరణాల్లో యువతే అధికం

పోలీసు రికార్డుల ప్రకారం హెల్మెట్ లేకపోవడం వల్లే అధిక శాతం యువత ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారని గణాంకాలు చెబుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను గారాబం చేస్తూ, వారి కోరిక మేరకు అధిక ఇంజిన్ సామర్థ్యం (సీసీ) ఉన్న ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసి ఇస్తున్నారు. వాటిపై హెల్మెట్ లేకుండా నిర్లక్ష్యంగా, అమిత వేగంగా వెళ్తూ, యువకులు ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. నగరంలోను, అలాగే కొవ్వూరు, నిడదవోలు, అనపర్తితో పాటు, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ఇటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గడచిన మూడేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 850 మంది మరణించగా, ఇందులో చాలావరకు హెల్మెట్ లేకపోవడంతోనే మృత్యువాత పడ్డారని పోలీసులు చెబుతున్నారు.

నిబంధన తీసుకొచ్చినా..

2010లోనే శిరస్త్రాణం తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిబంధన తీసుకువచ్చినా, అది అమలు కావడం లేదు. ఎంత అవగాహన కల్పించినా హెల్మెట్ ధారణపై ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. రాజమహేంద్రవరం లాంటి నగరాల్లో 20 శాతం మంది ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం మందే హెల్మెట్ ధరిస్తూ నగరంలోకి వస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం ఏవీ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వాహనం నడిపే యువకుడు హెల్మెట్ ధరించకపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. అలాగే బుధవారం రాజమహేంద్రవరం షెల్టన్ హోటల్ సమీపంలో మోటార్ బైక్‌పై ఉన్న నిడదవోలుకు చెందిన భార్యాభర్తలను ఆర్టీసీ బస్సు ఢీకొంది. తలకు తీవ్ర గాయమై భార్య మృతి చెందగా, భర్తకు కూడా తలకు తీవ్ర గాయాలై ఆస్పత్రి పాలయ్యారు.

కారణాలివే..

- రోడ్డు మలుపుల వద్ద వేగంగా వెళ్లడం, జాగ్రత్తలు పాటించకపోవడం
- కూడళ్లలో రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకపోవడం
- ఒక ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తూ అదుపు తప్పడం
- మద్యం మత్తు, నిర్లక్ష్యపు డ్రైవింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం
- మైనర్లు, లైసెన్స్ లేని వారు వాహనాలను నడపడం
- సరైన నైపుణ్యం లేని డ్రైవింగ్, రహదారి భద్రతపై అవగాహన లేకపోవడం

సురక్షిత డ్రైవింగ్‌కు హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్ ధరించి సురక్షితమైన ప్రయాణం చేసి గమ్యస్థానాలకు చేరాలి. హెల్మెట్ ధరించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో చాలామంది ద్విచక్ర వాహనదారులు చనిపోతున్నారు. హెల్మెట్‌ను ధరించడం భారంగా, బరువుగా భావించవద్దు. అది ప్రాణాలకు శ్రీరామరక్ష. ప్రాణం అన్నింటికన్నా విలువైంది. పోలీసులు, రవాణా శాఖాధికారులు కేసులు రాస్తారు, జరిమానాలు విధిస్తారని కాకుండా, తమ ప్రాణ రక్షణకే తనిఖీలు చేస్తున్నారని గుర్తించాలి.

– సూరిబాబు, ట్రాఫిక్ సీఐ

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి



ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ కూర్పులో కూర్చున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: అమరవీరుల త్యాగాలను ప్రతి విద్యార్థి గుర్తించాలని హుకుంపేట సరస్వతి ఇంగ్లిష్ మీడియం పాఠశాల చైర్మన్ పసుమర్తి ముకుంద ప్రియాచౌదరి అన్నారు. శుక్రవారం పాఠశాలలో 2019 ఫిబ్రవరి 14న తీవ్రవాదుల దాడిలో అమరులైన వీరులను స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు నల్లని దుస్తులు ధరించి సంతాపం తెలిపారు. విద్యార్థులు ఆర్మీ, సీఆర్‌పీఎఫ్ కూర్పులో కూర్చొని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ వాసురెడ్డి, డైరెక్టర్ పీఆర్‌కే చౌదరి, ఏఓ మౌలాలి, ప్రిన్సిపాల్ కె.కనక దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అమర వీరుడినీ స్మరించుకోవాలి

దేశం కోసం పోరాడే ప్రతి వీరుడినీ స్మరించుకోవాలని రాజమహేంద్రవరం ఆర్ఎస్ఎస్ ప్రచారక్ పార్థసారథి అన్నారు. పుల్వామా అమరవీరులకు శుక్రవారం బొమ్మూరు నేతాజీ నగర్, బృందావన కాలనీ ఆర్ఎస్ఎస్ శాఖ నివాళులర్పించింది. బృందావన కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ ప్రాంగణంలో సంస్థ బొమ్మూరు ప్రచారక్ సీహెచ్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

జక్కంపూడిని కలిసిన ముద్రగడ



జక్కంపూడి రాజాతో మాట్లాడుతున్న ముద్రగడ పద్మనాభం

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మాజీ మంత్రి, పార్టీ నాయకులు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు రాజమహేంద్రవరంలోని రాజా నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని ముద్రగడ అడిగి తెలుసుకున్నారు. ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ, అతిచిన్న వయస్సులోనే రాజా, గణేష్ రాజకీయాల్లో రాణిస్తూ, రాజానగరం నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటూ, గ్రామీణ ప్రాంతాల రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారన్నారు. తన తనయుడు ముద్రగడ గిరిబాబును ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా నియమించారని నాయకులకు పరిచయం చేశారు. ముద్రగడ గిరిబాబును జక్కంపూడి విజయలక్ష్మి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు ఆశీర్వదించారు. తండ్రి పద్మనాభం మాదిరిగానే గిరిబాబు కూడా రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు తోట రామకృష్ణ, గౌతు స్వామి, నందెపు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కేంద్రం మొండి వైఖరిని విడనాడాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

తపాలా ఉద్యోగుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: తపాలా శాఖ ప్రైవేటీకరణకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం 2023 పోస్టల్ చట్టాన్ని తీసుకురావటాన్ని తపాలా ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నట్టు అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాజమహేంద్రవరం డివిజన్ కార్యదర్శి కొండబాబు అన్నారు. శుక్రవారం స్థానిక హెడ్ పోస్టాఫీసు ఎదుట డివిజినల్ తపాలా ఉద్యోగుల సంఘాల నాయకులు, ఉద్యోగులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యూనియన్లకు, ప్రజలకు ఎటువంటి సమాచారం లేకుండా సర్వీసులన్నీ తొలగిస్తూ, ప్రైవేటీకరణ అజెండాగా పెట్టుకుని ప్రభుత్వం ఏకపక్ష వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. 2023 పోస్టల్ చట్టాన్ని అమలు చేసి పోస్టల్ ఐటీ 2.0 అని ఉద్యోగుల పొట్టకొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రజలకు అందించే సేవలు కానీ, ఉద్యోగుల సౌకర్యాలు కానీ ఏమాత్రం పట్టించుకోకుండా ప్రభుత్వం వారికి ఇష్టం వచ్చినట్లు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయటం దారుణమన్నారు. ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్స్, నోడల్ డెలివరీ సెంటర్ అనే కొత్త ప్రాజెక్టులను తీసుకువస్తూ, సంప్రదాయబద్ధంగా కొన్ని వందల ఏళ్ల నుంచి వస్తున్న తపాలా శాఖ సంప్రదాయానికి ఈ ప్రభుత్వం తూట్లు పొడిచే ప్రయత్నాలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, తపాలా శాఖ అధికార యంత్రాంగంగా తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యోగ సంఘాలన్నీ దశల వారీగా ఉద్యమాలను చేయనున్నట్టు వెల్లడించారు. అందులో భాగంగా మార్చి 18 నుంచి దేశవ్యాప్తంగా తపాలా ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు వారు వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర యూనియన్ నాయకత్వం ఇప్పటికే ప్రభుత్వానికి, తపాలా శాఖ అధికారులకు నోటీసులు ఇచ్చినట్టు చెప్పారు. మార్చి 18 వరకు డివిజన్, సర్కిల్, జాతీయ స్థాయిలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్టు వివరించారు. ఎఫ్ఎన్‌పీవో నాయకులు బీసీహెచ్ వీరయ్య, టి.రామ్‌గోపాల్, ఏవీ నరసింహారావు, ఎం వినోద్, సీహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సక్రమంగా వినియోగించుకోవాలి



మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: మహిళల అభివృద్ధి కోసం మంజూరు చేస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకుని, అభివృద్ధి సాధించాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్లమ్మపేటలో హనుమాన్ మహిళా స్వయం సహాయక సంఘ సమావేశానికి హాజరై, సంఘ కార్యకలాపాలను పరిశీలించారు. ప్రభుత్వం ప్రతి ఇంటి నుంచి ఓ మహిళ వ్యాపారవేత్తగా ఎదిగి, తన కుటుంబాన్ని, సంఘాన్ని అభివృద్ధి పరిచేలా కృషి చేయాలని కోరారు. బ్యాంకుల ద్వారా మంజూరైన రుణాలను వ్యాపార నిర్వహణకు వినియోగించి, జీవితాలను అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని, పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలన్నారు. హోమ్ కంపోస్టు విధానంలో వర్మీ కంపోస్టు తయారు చేసి, నర్సరీలకు అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. మహిళా సంఘాలు తమ ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా అమ్ముకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ రామలక్ష్మి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిన రాజబాబు

వర్ధంతి సందర్భంగా హాస్య నటుడికి ఘన నివాళి



రాజబాబు విగ్రహానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తెలుగు చిత్రసీమ ఉన్నంత వరకు ప్రముఖ హాస్య నటుడు రాజబాబు తన చిత్రాల ద్వారా పండించిన నవ్వులు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని పలువురు వక్తలు కొనియాడారు. రాజబాబు 42వ వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరం గోదావరి గట్టున ఉన్న ఆయన విగ్రహానికి పలువురు అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. సోదరుడు బాబీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేనల్లుడు బీఎస్ఎన్ఎల్ వాసు, రాజబాబు మిత్ర మండలికి చెందిన మునిని వెంకటేశ్వరరావు(బాబులు), సుందరం, కట్టా చంద్రరావు, పట్నాయక్, గణేష్, బాలాజీ, చత్రపతి శివాజీ తదితరులు రాజబాబు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ప్రేక్షకులకు మరువలేని నవ్వులు పంచిన రాజబాబు అతి చిన్న వయసులోనే భౌతికంగా దూరం కావడం ఆవేదన కలిగిస్తోందని పలువురు వక్తలన్నారు. 550 చిత్రాలకు పైగా నటించి ప్రేక్షకులను అలరించారని కొనియాడారు. ఆయన చేసిన గుప్తదానాలతో ఇప్పటికీ అందరి మనస్సుల్లో నిలిచిపోయారని, ఆయన ఆశీర్వాదంతో కుటుంబ సభ్యులు ముందుకు సాగుతున్నారన్నారు. చిన్న వయసులోనే ఆయన ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుని, అనంత శిఖరాలకు చేరారని నివాళులర్పించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సంజీవయ్య

ఎస్పీ నరసింహ కిషోర్



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా దామోదరం సంజీవయ్య ఖ్యాతి పొందారని ఎస్పీ డి.నరసింహ కిషోర్ కొనియాడారు. సంజీవయ్య జయంతిని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత సంజీవయ్య చిత్రపటానికి ఎస్పీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, రాష్ట్ర అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ నేత సంజీవయ్య అని శ్రద్ధాంజలి ఘటించారు. అనేక విప్లవాత్మక పథకాలతో ప్రజల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారన్నారు. విలువలకు జీవితాంతం కట్టుబడిన సంజీవయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ(ఎస్‌బీ) బి.రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్(ఎస్‌బీ) ఎ.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్(డీసీఆర్‌బీ) పవన్‌కుమార్ రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌కుమార్, ఎస్సై ఆలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు దామోదరం సంజీవయ్య



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌ఓ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శనీయులని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి కొనియాడారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి సంజీవయ్య అని, ఆయన జాతికి చేసిన సేవలు నిరుపమానమని ప్రస్తుతించారు. ఆయన కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు దేశంలో కార్మిక శాఖ, విద్యా శాఖలో పలు సంస్కరణలు చేసి, ఆయన రూపొందించిన చట్టాలు వివిధ వర్గాలకు ఎనలేని మేలు చేశాయని చెప్పారు. బోనస్ చట్టాన్ని ప్రవేశపెట్టడంతో, బోనస్ సంజీవయ్యగా పేరు పొందారని చెప్పారు. నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన సంజీవయ్య తన అసమాన ప్రతిభతో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగారన్నారు. నీతికి, నిజాయితీకి, నిరాడంబర జీవితానికి మారుపేరుగా మారి ఆదర్శనీయులుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

కడియం: దుళ్లలోని శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా శుక్రవారం భారీ అన్న సమారాధన జరిగింది. దాతలు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు హాజరై, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో గోవింద మాలధారులు, భక్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కడియం మండలంలోని గ్రామాల నుంచే కాక, ఆలమూరు, కొత్తపేట, మండపేట రూరల్ మండలాల నుంచి భక్తులు హాజరయ్యారు.

బీజేపీ మండల కమిటీ ఏర్పాటు

కడియం: కొత్త బీజేపీ కడియం మండల కమిటీని పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్ శుక్రవారం ఇక్కడ ప్రకటించారు. అధ్యక్షుడిగా బొరుసు సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా దూడల సత్తిబాబు, గుత్తుల నాగలక్ష్మి, కె.శ్రీనివాస్, సుంకర రాజబాబు, నాగేశ్వరరావు, కార్యదర్శిగా పి.వేంకటేశ్వరరావు, కొత్తపల్లి శివ, టి.భవానీప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా దాసరి ముత్యం, లోవరాజు, కోశాధికారిగా బచ్చు బలరాంను ఎంపిక చేశారు.

ధవళేశ్వరం: రాజమండ్రి రూరల్ బీజేపీ మూడో మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వర్దినిడి సూర్యనాగేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరారావు, హరిదాసు శ్రీలక్ష్మి, అంబాల నాగరాజు, గుత్తుల జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా వంకాదర కుబేరరావు, రాపేటి గణపతి, కోశాధికారిగా గండేపల్లి వెంకటలక్ష్మి, కార్యదర్శులుగా తలాటం సూర్యప్రకాష్‌రావు, భవాని, నాగేశ్వరరావు, వేమగిరి గనిరాజు, జగన్నాథరావు ఎన్నికయ్యారు.

సిబ్బంది నిబద్ధతతో పని చేయాలి



డైరీని ఆవిష్కరిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది నిబద్ధతతో పని చేసి, నగరపాలక సంస్థ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. శుక్రవారం పట్టణ ప్రణాళికా విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీపీఎంఎస్ ద్వారా వచ్చే ప్రతి భవన నిర్మాణ దరఖాస్తును పెండింగ్‌లో ఉంచకుండా, నిరీత సమయంలోని పరిష్కరించాలన్నారు. బీపీఎస్ దరఖాస్తులు పరిశీలించి, వాటిని పరిష్కరించడానికి అవసరమైన అన్ని పత్రాలు జత చేసి దాఖలు చేయాలన్నారు. రాబోయే పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగరంలో చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ కార్యక్రమాలను సమీక్షిస్తూ, ఆయా ప్రాంతాల్లో భవన యజమానుల నుంచి పత్రాలను వెంటనే సేకరించాలన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది డైరీని ఆవిష్కరించారు.

దళిత విద్యార్థి చేతులు నరకడం దారుణం

మాజీ ఎంపీ హర్షకుమార్ ఆవేదన



విలేకరులతో మాట్లాడుతున్న హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ: తమిళనాడులోని ఓ కాలేజీలో డిగ్రీ దళిత విద్యార్థి రెండు చేతులు నరకడం అమానుషానికి పరాకాష్ట అని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలో విలేకరులతో మాట్లాడుతూ, బుల్లెట్ నడిపితే అంత వివక్ష చూపాల్సిన అవసరం లేదన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లయినా ఇంకా ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రభుత్వాన్ని నిందించకపోతే, సమాజంలో జరుగుతున్న పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. సుప్రీం కోర్టు పక్షపాత దృష్టితో ఎస్సీ చట్టాల్ని నీరు గారుస్తోందని ఆరోపించారు. అట్రాసిటీ యాక్ట్ కేసుకు స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. చుండూరులో ఊచకోత జరిగితే నిందితులని నిర్దోషులుగా విడుదల చేశారని, ఇప్పటికీ ముద్దాయిలను పట్టుకోకపోవడం విచారకరమన్నారు. ఇకనైనా సుప్రీం కోర్టు, కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకొచ్చి, దళితులపై దాడులను ఆపి, వారిని కాపాడాలని కోరారు.